# "మార్పు"

- శ్రీమతి న్యాయపతి కమలారాణి

మల్లెపూలు ఎరుపురంగులో పూశాయంటే ఆశ్చర్యపోనక్కర్లేదు! మందారాలు మల్లెపూవు సైజులో పూశాయన్నా ఆశ్చర్యపడనక్కర్లేదు! నింగిలోని నక్షత్రాలన్నీ నేలమీదకు జారిపోయాయని ఎవరైనా చెప్పినా ఆశ్చర్యం కలగదేమో!? కానీ వరలక్ష్మిలో మార్పు వచ్చిందంటే మాత్రం మా అందరికీ చాలా ఆశ్చర్యంతోపాటు ఎంతో బాధ కూడా కలిగింది!! కలకాదు నిజం అని గిల్లి చూసుకుంటే తెలిసింది!

వరలక్ష్మి ఇప్పుడు తన జబ్బుల గురించి చెప్పడం మానేసిందంటే చాలా వింతగా, నమ్మశక్యం కాకుండా ఉంది. వినేవాళ్లకు ఓపిక ఉండాలే కాని వరలక్ష్మి తన వంట్లో ఉన్న జబ్బులన్నీ అదే పనిగా అనర్గళంగా, అంటే ఫుల్ స్టాపు, కామాలు లేకుండా అలా చెప్తూనే ఉంటుంది! అలాంటి వరలక్ష్మిలో అంత మార్పు వచ్చిం దంటే దానిక్కారణమయిన ఆ విషాధ సంఘటన అటుంచి ఆమె వాక్ప్రవాహానికి మేం ఎలా బలయిపోయామో, ఎన్నిసార్లు బలయిపో యామో తెలుసుకోవడం చాలా ముఖ్యం....



వరలక్ష్మి వాళ్లు మా ఇంటి పక్కనే ఉంటున్నారు. ఆమె భర్త స్టేట్ బ్యాంకులో ఆఫీసరు. వాళ్లకి అయిదుగురు పిల్లలు. ముగ్గురు అమ్మాయిలు. ఇద్దరు అబ్బాయిలు. ఇద్దరు అమ్మాయిలకి పెళ్లిళ్లు చేసేశారు ఎలాగో. ఆఖరి అమ్మాయి ఉంది పెళ్లికి. అబ్బాయిలిద్దరూ చదువుతో గజనీదండ యాత్రలు, ఘోరీ దండయాత్రలు చేస్తున్నారు ఇంకా.

ఒకరోజు మా అక్క, నేను షాపింగ్‌కని బయలుదేరాం. వీధిలోనే ఎదురయింది వరలక్ష్మి.

"సునీతా! ఎక్కడికి వెళ్తున్నారే?"

"అదేం ప్రశ్న! ఎవరైనా బయటకు వెళ్లేటప్పుడు ఎక్కడికి వెళ్తున్నారు? అని అడక్కూడదని తెలీదా ఆవిడకి! అదేం మనిషిరా బాబూ! ఇంక ఆవిడ... మనల్ని వదలదు. ఆవిడ మాట వినిపించుకోకుండా వెళ్లిపోతే..." ఎంత గర్వమే నీకు!" అనేస్తుంది ముఖం మీదే" అనుకున్నాను.

నేను ఆవిడ దగ్గరగా వెళ్లి "ఏంలేదు ఆంటీ! అక్క పెట్టికోట్స్ కొంటానంటే బయల్దేరాం."

"అన్నట్టు నిన్నరాత్రి ఏమయిందో తెలుసా? పెద్ద గండం గట్టెక్కిందనుకో!"

"అప్పుడే మొదలెట్టేసింది! అడ్డంగా దొరికిపోయాను" అనుకున్నాను.

వదిలించుకుని వెళ్లిపోవడానికి ధైర్యం చాల్లేదు. అసలు నా ముఖంలోని ఎక్స్‌ప్రెషన్స్ ఆమెకి అక్కర్లేదా!. పట్టించుకోదా! ఆవిడ చెప్పింది వినడానికి శ్రోతలు దొరికితే చాలు.

"నిన్నరాత్రి నాకు మాటపడిపోయింది".

"ఆ!" అన్నానేను నోరెళ్లబెట్టి.

"అంత అదృ ష్టమా!" అని మనసులో అను కుంటూ.

అప్పుడు బల్బు వెలిగింది. "అదేంటి ఇప్పుడు మాట్లాడుతున్నారు కదా" అని . ఆ మాటే అన్నాను ఆవి డతో.

"అవును. నిజం. మాట పడిపోయిం ది. మూగ దానిలా సౌంజ్ఞలు చేశాను తెలుసా?. ఏ థ్రోట్ కాన్సరు వచ్చిందేమోనని భయపడ్డాను. ఇంట్లో వాళ్లందరూ హడలి పోయారనుకో".

"అనలు ఏమయింది ఆంటీ?"

"అదే తెలియడం లేదు. విచిత్రంగా ఉంది. ఒళ్ళంతా వణికి పోయింది. కానీ ఆ దేవుడి దయ వల్ల పొద్దున కల్లా నాకు మాటలు వచ్చేశాయి!" అంది సంతోషంగా. ఏడాది పిల్లకి అప్పుడే అమ్మ, అత్త, తాతలాంటి